క్లుప్తంగా

అక్నూ రిజిస్ట్రార్‌ను కలిసిన జీవీ రావు



అక్నూ రిజిస్ట్రార్ సుధాకర్‌ను కలిసిన జీవీరావు

రామచంద్రపురం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ జి.సుధాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్టు మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీరావు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. సుధాకర్ నేతృత్వంలో యూనివర్సిటీ మరిన్ని విద్యా కాంతులు వెదజల్లాలని ఆయన ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈమేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశామని రావు తెలిపారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

మండపేట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటకోత ప్రయోగాల నిర్వహణపై మండల వ్యవసాయ సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి కె.ఏ సుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఓ పి.వెంకటేశ్వరరావు, ఆలమూరు ఏడీఏ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ పంటకోత ప్రయోగం ఎంత విస్తీర్ణంలో చేయాలి, ఏ విధంగా లెక్కించాలని అనే అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ, ఆర్థిక గణాంక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పీఎం ఫసల్ బీమా యోజన పథకం అందిస్తున్న పంటల బీమా పథకంలో భాగంగా ఈ శిక్షణ ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

రెగ్యులర్ చేయాలని కోరుతూ నిరసన



కాజులూరులో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కాజులూరు: సమగ్ర శిక్షా అభియాన్‌లో గత 13ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారిని ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని కోరుతూ మండల కేంద్రమైన కాజులూరులో బుధవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా గత 13ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నామని తామందరిని రెగ్యులర్ చేసి ఒకటో తేదీన జీతాలు వచ్చేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు.

వెంకటాయపాలెంలో మెగా వైద్య శిబిరం



వెంకటాయపాలెంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కాకినాడ జీజీహెచ్ వైద్యురాలు డాక్టర్ చప్పిడి భవ్య ప్రయోనిధి వైద్య సేవలు అందించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొని కేక్ కట్ చేసి, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా పాల్గొన్నారు. పీఎంపీ, ఆర్ఎంపీలు కేవీవీ సత్యనారాయణ, ఎస్.కృష్ణారావు, సత్యనారాయణ, సీహెచ్ దేవానందం, భాస్కరరావు తదితరులు వైద్య సహకారం అందించారు.

ఇరువర్గాలపై కేసు

రామచంద్రపురం రూరల్: రెండు కుటుంబాల మధ్య జరిగిన కొట్లాట నేపథ్యంలో ఇరువర్గాల వారి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాయపాలెం శివారు వీరేశగుళ్లులో ఇరుగు పొరుగున నివసించే ఇళ్ల సుజన జ్యోతి, పోలవరపు సింహాద్రి కుటుంబాలకు గత కొన్నేళ్లుగా పాత గొడవలు ఉన్నాయి. ఈ నెల 11న ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై బుధవారం తమపై దాడి చేశారని ఇళ్ల సుజనజ్యోతి, ఇళ్ల ప్రకాష్‌పై పోలవరపు సింహాద్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. అలాగే పోలవరపు సింహాద్రి, కిల్ల చిన్నారావు, కిల్ల దేవి, కిల్ల నరసింహ, రొంగల వరలక్ష్మి తనపై దాడి చేశారని ఇళ్ల సుజన జ్యోతి చేసిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినోద్ తెలిపారు.

కూరలు దిగివచ్చిన వేళ!

- కిలో రూ.200 నుంచి రూ.40కి తగ్గిన టమాట
- రూ.120 నుంచి రూ.45కు తగ్గిన మిర్చి
- రూ.50లోపే ఇతర కూరగాయల ధరలు



కూరగాయలు

మండపేట: దిగుబడులు లేక నెలరోజుల క్రితం దడ పుట్టించిన కూరగాయల ధరలు పేదలకు ఊరటనిస్తూ దిగివచ్చాయి. రికార్డు స్థాయిలో కిలో రూ.200కు చేరిన టమాట రూ.40కి తగ్గిపోగా, రూ.120 పలికిన పచ్చిమిర్చి రూ.50కి వచ్చింది. ఇతర కూరగాయలు రూ.40లోపే ఉండగా ఉల్లి ధర మాత్రం ఘాటెక్కుతోంది. ఈశాన్య రుతుపవనాల రాకలో జాప్యం, ఎండల తీవ్రతతో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సాధారణంగా జూలై నెలలో అంతంతమాత్రంగా ఉండే కూరగాయల ధరలు దిగుబడి లేక పెరిగిపోయాయి. ప్రధానంగా వంటల్లో ఎక్కువగా వినియోగించే టమాట, మిర్చి ధరలు మండిపోయాయి. మునుపెన్నడూ లేని విధంగా టమాట కిలో రూ.200కు చేరుకోగా మిర్చి రూ.120 పలికింది. వంకాయ, బీర, బెండ, దొండ తదితర కూరగాయలు రూ.60 నుంచి రూ.70కి చేరి సామాన్యులకు చుక్కలు చూపించాయి. టమాట కొనాలంటేనే సామాన్యులు బెంబేలెత్తిపోవాల్సిన పరిస్థితి ఉండేది. కొందరు కూరల్లోంచి టమాటను తీసేయ్యగా, కిలో చొప్పున కొనేవారు పావుకిలో కొనే పరిస్థితి కనిపించేది. వినియోగదారులపై భారం పడకుండా ప్రభుత్వం సబ్సిడీపై రూ.50కు రైతు బజార్లలో టమాట విక్రయించింది.

తాజా ధరలివి..

చిత్తూరులో టమాట దిగుబడులు పెరగడం, గోదావరి లంకల్లో పంట ఉత్పత్తులు రావడంతో రెండు వారాలుగా ధరలు దిగివస్తున్నాయి. బుధవారం మండపేట మార్కెట్‌లో టమాట రూ.40కు తగ్గిపోగా, పచ్చిమిర్చి రూ.50కు తగ్గింది. వంకాయలు కిలో రూ.40 ఉండగా, బెండకాయలు రూ.22, కాకరకాయలు రూ.38, బీరకాయలు రూ.40, దొండకాయలు రూ.32, బంగాళదుంపలు రూ.23కు తగ్గాయి. కూరగాయల ధరలు రూ.40లోపు తగ్గడంపై పేద, మధ్యతరగతి వర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘాటెక్కుతున్న ఉల్లి

ఇతర కూరగాయల ధరలు దిగివస్తుంటే ఉల్లి ధర మాత్రం ఘాటెక్కుతోంది. వారం రోజుల క్రితం రూ.20 ఉన్న ఉల్లి ప్రస్తుతం రూ.35కు చేరుకుంది. రాష్ట్రంలో ఉత్పత్తి అంతగా లేకపోవడంతో మహారాష్ట్రలోని నాసిక్, సోలాపూర్, శ్రీరాంపురం తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఆయా చోట్ల అధిక ధరకు కొనుగోలు చేయడంతో పాటు రవాణా చార్జీలు కూడా ఎక్కువై మార్కెట్‌కు చేరే సరికి ధర పెరిగిపోతోంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

ధరలు తగ్గాయి



పంటలు దెబ్బతిని నెలరోజుల క్రితం టమాట, మిర్చి ధరలు బాగా పెరిగాయి. కొత్త పంటలు రావడంతో ధరలు దిగి వస్తున్నాయి. టమాట ధర ఎక్కువగా ఉన్నప్పుడు మండపేట రైతుబజారు నుంచి రూ.50కు రెండున్నర టన్నులు సబ్సిడీపై అందించాం.

– బొల్ల సతీష్, ఎస్టేట్ ఆఫీసర్, రైతుబజార్, మండపేట

సామాన్యులకు అందుబాటులో..



నెలరోజుల క్రితం టమాట, మిర్చి ధరలు సామాన్యులకు ఏ మాత్రం అందుబాటులో లేకుండా ఉన్నాయి. ధరలు తగ్గి పేదలకు అందుబాటులోకి రావడం సంతోషాన్నిస్తోంది. ఇతర కూరగాయల ధరలు తక్కువగానే ఉన్నాయి.

– పిల్లా రజినీ, గృహిణి, పాలతోడు

మండపేటలో భారీ వర్షం



మండపేటలో వర్షంలో రాకపోకలు

మండపేట: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో బుధవారం రాత్రి మండపేట, పరిసర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శ్రావణ శుక్రవారం సందర్భంగా పూజాసామాగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు పరిసర గ్రామాల నుంచి మండపేట మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వచ్చింది.

అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: పెద్ద తాళ్లపాలెంలోని కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ 23వ వార్షికోత్సవం బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పంపన నాగేశ్వరరావు, ఇతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం



పల్లిపాలెంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి వేణు

మంత్రి వేణుగోపాల కృష్ణ

కాజులూరు: రాష్ట్ర ప్రజల సంక్షేమంతోపాటుగా అవినీతికి తావు లేకుండా పారదర్శకమైన పాలనను అందించటమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని పల్లిపాలెంలో బుధవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా వారి పొందిన లబ్ధిని వివరించారు. కాలనీల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడిక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల కష్టాలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి వద్దకే చేరుస్తున్నారన్నారు. నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబంలో సంతోషం నెలకుందని, చెప్పిన మాట ప్రకారం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ఆయనకు ప్రజలంతా అండగా ఉండాలని మంత్రి కోరారు. సంక్షేమ పాలనను చూడ లేని ప్రతిపక్షాలు ఏదోరకంగా రాష్ట్రంలో అశాంతిని సృష్టించాలనే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా పథకాలన్నీ ప్రజలకే నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంటే ప్రజల సంక్షేమాన్ని చూడలేని ప్రతిపక్షపార్టీలు ప్రభుత్వాన్ని విమర్శించడం తగదన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాలన సాగిస్తున్నామని దానికి నిదర్శనంగానే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు నీరజనాలు పడుతున్నారని మంత్రి అన్నారు. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపీపీ మాతా భారతి, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి శ్రీను, వైఎస్ఆర్ సీపీ మండల బీసీసెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పార్టీ నాయకులు యాళ్ల సత్తిబాబు, దంగేటి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి



టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రాజు తదితరులు



ఎంపీడీఓ కార్యాలయంలో టంగుటూరికి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు

మండపేట: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 151 జయంతి వేడుకలను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఐ.రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. పరిపాలన అధికారి వి.నాగేంద్రప్రసాద్, ఈఓ ఎస్.రామ్మోహనరావు, సీనియర్ అసిస్టెంట్ పి.జనార్దనకుమార్, గోపాల్, సతీష్, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి వారసత్వాన్ని కొనసాగించాలి

కపిలేశ్వరపురం: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వారసత్వాన్ని ప్రతిఒక్కరూ కొనసాగించాలని బుధవారం నిర్వహించిన ఆయన 152వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ టంగుటూరి అతి సామాన్య కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకుని ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ ఎం.ప్రకాష్, విద్యాశాఖ కార్యాలయ ఎంఐసీ టి.సురేష్, కంప్యూటర్‌ఆపరేటర్ సత్యనారాయణ, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రకేసరి చిత్రపటానికి ఎంపీపీ నవుడు వెంకటరమణ, తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ డి. శ్రీనివాస్, పీఆర్ డీఈఈ రామ్నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి

మండపేట: అంగనవాడీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అంగనవాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అంగనవాడీ కార్యకర్తలు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్ తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు.

‘ఆడుదాం ఆంధ్రా’ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగరాజు



కపిలేశ్వరపురంలో ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమంపై చర్చిస్తున్న ఎంపీడీఓ తదితరులు

కె.గంగవరం: అక్టోబర్ రెండో తేదీన నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా ఆటలపోటీలను సమన్వయంతో విజయవంతం చేయాలని ఎంఈఓ ఏ నాగరాజు సూచించారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం హెచ్ఎంలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ గ్రామ స్థాయి పోటీలు నిర్వహించాలని 10 నుంచి 17 వరకూ మండల స్థాయిలో పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయం నుంచి బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించాలన్నారు. పోటీల నిర్వాహణకు పంచాయతీ స్థాయిలో ఒక కమిటీ, మండల స్థాయిలో ఒక కమిటీ నియమించాలన్నారు. మండల స్థాయిలో క్రీడల నిర్వహణకు కమిటీ సభ్యులుగా ఎంఈఓ-2, సహాయకులుగా హెచ్ఎం పుల్లయ్య, కుందూరు ఉన్నత పాఠశాల పీడీని కమిటీగా నియమించామని వారు పంచాయతీ కార్యదర్శులతో సహకరించుకుని క్రీడాకారుల ఎంపిక, నిర్వహణ చూడాలని కోరారు. తహసీల్దార్ వైద్యనాథశర్మ, ఈఓపీఆర్‌డీ నరేంద్ర, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామోపాధ్యాయులతో తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఎంఈఓ కె.తాతారావు సమావేశమయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ తీరుతెన్నులపై ఎంఈఓ తాతారావు అవగాహన కల్పించారు. అక్టోబర్ 2న ప్రారంభమయ్యే ఆటల్లో రాణించేలా విద్యార్థులకు తర్ఫీదునివ్వాలని ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ సూర్యారావు ఉపాధ్యాయులకు సూచించారు.

మండపేట: గ్రామీణస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఐ రాజు కోరారు. కార్యక్రమం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీఓ రాజు, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు సచివాలయ స్థాయిలోను, 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ మండల స్థాయిలోను, 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలోను, 28వ తేదీ నుంచి నవంబరు 3వ తేదీ వరకు జిల్లా స్థాయిలో బాడ్మంటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. ఒక్కో ఆటకు సంబంధించి పురుషులు, మహిళ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు ఎంఈఓ ఎస్ రామచంద్రరావు, పీఆర్ జేఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమం నిర్వహణపై స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు విజయరేఖ, మండల పరిషత్తు కార్యాలయ సూపరింటెండెంట్ డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షల్లో నిర్లక్ష్యం వద్దు



పుల్లేటికుర్రులో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర

అంబాజీపేట: ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలని, వాటిపై నిర్లక్ష్యం వద్దని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర అన్నారు. ముక్కామల, పుల్లేటికుర్రు, మొసలపల్లి సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. దుర్గారావుదొర మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో ఇంటింటా సర్వే చేసి జ్వర రోగులతో పాటు ఇతర వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి పూర్తి స్థాయిలో వైద్యం, మందులు అందించాలన్నారు. సచివాలయాల్లో రోగులకు అవసరమైన మందులన్నింటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా అమలు చేయాలన్నారు. అంతకుముందు ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమ్యశైలజ, ఎంపీహెచ్ఈవో ఆర్.రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ చందు, ఎం.వెంకటేశ్వరరావు, రవిశంకర్, ఏఎన్ఎంలు, ఆశాలు ఆయన వెంట ఉన్నారు.

గంజాయి తాగుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అరెస్టు

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు వద్ద గంజాయి సేవిస్తున్న ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. రాజోలు మండలం శివకోడు గ్రామానికి చెందిన ఆ యువకుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం అతడు స్థానిక అక్విడెక్టు విద్యుత్ టవర్ వద్ద గంజాయితో నింపిన సిగరెట్ కాలుస్తూ ఉండగా పట్టుకున్నారు. అతని నుంచి 10 గ్రాముల గంజాయితో పాటు ఒక సిగరెట్ ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి వివరించారు.


షాపుల వేలంతో పంచాయతీకి రూ.11.37 లక్షల ఆదాయం

రావులపాలెం: స్థానిక గ్రామ పంచాయతీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లను బుధవారం అధికారులు వేలం నిర్వహించారు. సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేలంలో పలువురు వ్యాపారులు ఆయా షాపులను వ్యాపార అవసరాల నిమిత్తం పాడుకోగా పంచాయతీకి నెలకి రూ.11,37,206 ఆదాయం సమకూరుతున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ తెలిపారు. మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్, డైలీ మార్కెట్ల వద్ద మొత్తం 79 షాపులకు గాను 25 షాపులకు హైకోర్టు స్టే ఇవ్వడంతో 53 షాపులకు అధికారులు మూడు సంవత్సరాల కాలంతో వేలం నిర్వహించారు. ఈ పాటలో షాపులు దక్కించుకున్న వారికి మూడు సంవత్సరాల అనంతరం 10% పెంచి మరో మూడు సంవత్సరాలు మొత్తంగా ఆరు సంవత్సరాల కాల పరిమితికి వేలం నిర్వహించారు. అత్యధికంగా ఒక షాపుకు రూ.70 వేలు పలకగా అత్యల్పంగా రూ.7 వేలు పలకడం విశేషం.

వస్తువుల కొనుగోలుపై అవగాహన ఉండాలి

అంబాజీపేట: వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తూనికలు, కొలతలు, ధర నిర్ధారణ తదితర వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ టి.మంగతాయారు, కోనసీమ కన్జ్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు వినియోగదారుల వస్తుసేవల వినియోగంపై అవగాహన సదస్సును హెచ్ఎం కె.సాయిరామ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు.

ఇస్రోకు శుభాకాంక్షలు



ల్యాండింగ్ ప్రక్రియను వీక్షిస్తున్న విద్యార్థినులు

కాజులూరు: చంద్రయాన్-3 విజయవంతం కావాలని కోరుతూ మండలంలోని గొల్లపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇస్రోకు శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల క్రీడా ప్రాంగణంలో హెచ్ఎం సుశీలమణి, పీఈటీ సునీల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం తెల్లటి వస్త్రాలు ధరించి ఇస్రో ఇంగ్లీషు అక్షరాల రూపంలో ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు.


పాఠశాలల్లో వేడుకలు



ఇస్రో ఆకృతిలో ఉన్న విద్యార్థులు

మండపేట: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం సందర్భంగా ఎంఈఓ ఎస్.రామచంద్రరావు ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం వేడుకలు నిర్వహించారు. సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియకు సంబంధించిన లైవ్‌ను విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి వీక్షించారు. ల్యాండర్ విజయవంతంగా ల్యాండింగ్ అయిన అనంతరం జయహో భారత్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామచంద్రరావు మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతంతో అంతరిక్ష పరిశోధనల్లో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించిందన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తల సమష్టి కృషి దేశానికి గర్వకారణం



రామచంద్రపురం రూరల్: చంద్రయాన్-3 విజయవంతం అవ్వడంపై విశాఖపట్నం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీలో పని చేస్తున్న ద్రాక్షారామకు చెందిన సీనియర్ సైంటిస్ట్ తణుకు నాగ రాధ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయంలో సమష్టిగా పనిచేసిన ఇస్రో, అనుబంధ వ్యవస్థల శాస్త్రవేత్తలు, సిబ్బంది దేశం గర్వించేలా చేశారన్నారు. ప్రపంచ దేశాలలలో భారత దేశం పేరు బుధవారం మార్మోగిందన్నారు.

చంద్రయాన్ విజయవంతంతో పులకించిన భారతావని

రాయవరం: చంద్రుడుపై చంద్రయాన్-3 ల్యాండింగ్ విజయవంతం కావడంతో పట్టణాలు, పల్లెలు యావత్ భారతావని పులకించింది. బుధవారం విద్యార్థులు, శాస్త్రసాంకేతిక రంగ అభిమానులు ఉత్కంఠగా టీవీలను వీక్షించారు. సాయంత్రం 6.04 గంటలకు విక్రమ్ ల్లాయండ్ చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ జరిగిందని, చంద్రయాన్-3 విజయవంతమైనట్టు ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించడంతో వాడవాడలా హర్షాతిరేకాలు మిన్నంటాయి. 41రోజుల ప్రయాణం అనంతరం బాబిల్లి ఉపరితలంపై విజయవంతం కావడం చారిత్రక ఘట్టమని రాయవరానికి చెందిన డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పురవీధుల్లో ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.